క్లుప్తంగా

అంబలి కేంద్రం ప్రారంభం


అంబలి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంటి ప్రభు తన తల్లిదండ్రులు శివయ్య, మాణెమ్మల జ్ఞాపకార్థంగా వట్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అపర్ణ, మాజీ ఎంపీపీ విఠల్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్, కచూర్‌రావు, ఈశ్వరప్ప, సురేష్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రాములునాయక్


సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతున్న రాములునాయక్

నారాయణఖేడ్: మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఖేడ్ నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశానని తెలిపారు. ఇచ్చిన హామీని పార్లమెంటు ఎన్నికల అనంతరం నిలబెట్టుకుంటామని సీఎం హామీనిచ్చినట్లు రాములునాయక్ తెలిపారు.

ఘనంగా తిరుమలేశ్వర ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ లక్ష్మి పద్మావతి సహిత తిరుమలేశ్వర ఆలయ 20వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి పల్లకీసేవను పురవీధుల గుండా ఊరేగించారు.

చేపలు మృత్యువాత


మరణించిన చేపలు

జహీరాబాద్: మొగుడంపల్లి మండల పరిధిలోని జాడీమల్కాపూర్ గ్రామం చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. విషప్రయోగం వల్ల చేపలు మరణించాయా లేక ఏదైన కారణం చేత మరణించాయా అనే ఆందోళన మత్స్యకారుల్లో వ్యక్తమవుతోంది. చేపలు మరణించిన విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదని మత్స్యకారులు వాపోయారు. అధికారులు స్పందించి చేపల మృతికి కారణాలను కనుగొనాలని కోరారు.

కారు, టిప్పర్ ఢీ..

త్రుటిలో తప్పిన ప్రమాదం

నారాయణఖేడ్: కారు, టిప్పర్ ఢీకొనడంతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ మున్సిపల్ కార్యాలయం వీధిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు హిరామన్ తన కారులో మేయిన్ రోడ్డుపైకి వస్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన టిప్పర్ కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా హీరామన్ క్షేమంగా బయటపడ్డాడు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గం ఎల్గోయి గ్రామానికి చెందిన జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రెండు దశాబ్దాలు పత్రిక రంగంలో పనిచేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జర్నలిస్టు యూనియన్‌లో వివిధ హోదాల్లో ప్రభాకర్ బాధ్యతలు నిర్వహించారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

జిల్లావ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ కొందరివాడు కాదు.. అందరివాడని, బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన మహనీయుడని కొనియాడారు. నేటి యువత అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.



జహీరాబాద్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బీబీ పాటిల్, నాయకులు


పటాన్‌చెరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


నారాయణఖేడ్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి


జహీరాబాద్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు


హత్నూర: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


సదాశివపేట: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కౌన్సిలర్లు


పటాన్‌చెరు టౌన్: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు


రామచంద్రాపురం: పూలమాల వేస్తున్న మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు


జహీరాబాద్ టౌన్: మల్‌చెల్మలో పూలమాలలు వేస్తున్న నాయకులు


వట్‌పల్లి: జయంతిలో పాల్గొన్న కన్‌సాన్‌పల్లి గ్రామస్తులు


సంగారెడ్డి టౌన్: నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు


కల్హేర్: నివాళులర్పిస్తున్న నాయకులు, యువకులు


మునిపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


న్యాల్‌కల్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు


ఝరాసంగం: అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న నాయకులు


కందిలో...


జిన్నారంలో...


జోగిపేటలో...

కారు, బైక్ ఢీ..

తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

వట్‌పల్లి(అందోల్): కారు, బైక్ ఢీకొనడంతో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని అల్మాయిపేట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం .. నర్సాపూర్ నియోజకవర్గం పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మల్లేశం, ప్రసాద్ బైక్‌పై వ్యవసాయ పనిముట్లు తేవడానికి అల్మాయిపేట గ్రామానికి వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో దర్గా సమీపంలోకి రాగానే జోగిపేట నుంచి సంగారెడ్డికి వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మల్లేశంకు, ప్రసాద్‌కు కాళ్లు, చేతులు విరిగిపోయి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఆస్పత్రికి తరలించారు. మల్లేశం పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బాధితుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మునిపల్లి(అందోల్): వాహనదారులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని బుదేరా ఎస్‌ఐ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనం నడిపే సమయంలో వాహనం నెంబర్ ప్లేట్, ఇన్సురెన్స్, ఆర్సీబుక్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు మోటర్ సైకిల్ ఇవ్వొద్దని సూచించారు. రోడ్డుపై వాహనాలను నిలపరాదన్నారు. దాబాలు, హోటళ్లు రాత్రి 11.30గంటలలోపు మూసివేయాలన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పస్తాపూర్ మహీంద్ర కాలనీలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాలనీలోని వేంకటేశ్వర ఆలయం నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన వసుంధర కాలనీ తదితర ప్రాంతాల గుండా కొనసాగింది. లోక కల్యాణం కోసం ప్రతి వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులకు అల్పాహారం వితరణ చేశారు.

వైభవంగా శేషవాహన సేవ

నారాయణఖేడ్: పట్టణంలోని చారిత్రాత్మక సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం అఖండహరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శేషవాహన సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహన సేవ, చైతన్యమహారాజ్ కీర్తన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెంకట్రామిరెడ్డిని గెలిపించుకుందాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులతో కలిసి ఈ నెల 16వ తేదీన సుల్తాన్‌పూర్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ప్రజాఆశీర్వాద సభ విజయవంతం చేయాలని కోరుతూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాఆశీర్వాద సభకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరు కాబోతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యేవిధంగా సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, మాజీ ఎంపిపి శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు నగేష్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, అఫ్జల్, రాజేష్, మల్లారెడ్డి, మేరాజ్ ఖాన్, బండి శంకర్, శ్రీశైలం, చెన్నారెడ్డి, కృష్ణ కాంత్, విశాల్, రాజు, షకీల్, శ్రీపాల్ పాల్గొన్నారు.


నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి డీఎస్ కాలనీలో మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజకు మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ సేవా సమితి సభ్యులు నీలం మధును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు అశోక్, నిర్వాహకులు శ్రీరామ్‌మూర్తి, రామకృష్ణ, సుబ్బారావు, సుందర్ నారాయణ, వెంకటేష్ శ్రీనివాస్, గౌరీనాయుడు, పోలినాయుడు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న నీలం మధు..

అమీన్‌పూర్ మండల పరిధిలోని గండిగూడెం గ్రామంలో మల్లన్న జాతరకు ఆదివారం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను యాదవ సంఘం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.


పడిపూజలో పాల్గొన్న నీలం మధు

తాగునీరు వృథా

పట్టించుకోని అధికారులు


ట్యాంకు పైనుంచి వృథాగా పోతున్న తాగునీరు

ఝరాసంగం(జహీరాబాద్): ఓవైపు తాగునీరు ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనంతో తాగునీరు వృథాగా పోతుంది. ఝరాసంగం మండల కేంద్రంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిండిపోయి 2గంటల పాటు తాగునీరు నీరు వృథాగా పోయింది. నీరు వృథాగా పోవడం పరిపాటిగా మారిందని స్థానికులు అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒకచోట తాగునీరు వృథాగా పోతోందని, అయినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు


విలియంను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది చాలామంది కల.. ఉద్యోగం కోసం రాత్రిపగలు తేడా లేకుండా కష్టపడుతుంటారు. తల్లిదండ్రులు కూడా తమపిల్లలు మంచి ఉద్యోగాలు సాధించి బాగా స్థిరపడాలని కోరుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం మాటల్లో చెప్పినంత సులభం కాదు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఒకే కుటుంబంలోని అన్నదమ్ములు ఇద్దరు ప్రభుత్వం ఉద్యోగం సాధించారు. జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో నివాసం ఉండే దళిత కుటుంబానికి చెందిన బర్దిపూర్ బాబు, గౌతమి దంపతులకు నలుగురు సంతానం. బాబు మేస్త్రీ పనులు చేస్తుండగా భార్య గౌతమి కూరగాయలు అమ్ముతోంది. కష్టపడి నలుగురు పిల్లలను బాగా చదివించారు. ఇద్దరు పిల్లలు బెన్నిహిన్, విలియంలు(టీఎస్‌ఎస్‌పీ) తెలంగాణ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమై పరీక్షలు రాయగా మొదటి అటెంప్ట్‌లోనే కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు బరూర్ దత్తాత్రి, రమేష్, శివరాజ్, శ్రీనివాస్, సురేష్ తదితరులు వారిని ఘనంగా సన్మానించారు.

రోడ్లను ఆక్రమిస్తున్నవారిపై

చర్యలకు సిద్ధం

- నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ అధికారులు
- రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక


విద్యుత్‌నగర్ కాలనీ ముఖద్వారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలోని రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. విద్యుత్‌నగర్ కాలనీలో సుమారు 1900పైగా ఇళ్లు ఉన్నాయి. కాగా కొంతమంది వారి ఇళ్ల ప్రహరీ బయట ఉన్న స్థలాలను వ్యాపార స్థలాలుగా మారుస్తున్నారని పలువురు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. మరి కొంతమంది ఇంటి పక్కల ఆనుకొని ఉన్న మున్సిపాలిటీ స్థలాలను చిరువ్యాపారస్తులకు అద్దెలకు ఇవ్వడమే కాకుండా ఇళ్ల ముందు కారు షెడ్లను వేస్తున్నారని కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు సంబంధిత వ్యాపారులకు నోటీసులు జారీచేస్తున్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి రోడ్లు ఆక్రమించి నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. కాగా ఈ ప్రకటనల ఆదాయ విషయంలో ఇటు మున్సిపాలిటీ ఆటు బెల్ యాజమాన్యం మాకే చెందాలంటే మాకే చెందాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కాలనీలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే..

నోటీసులు జారీ చేస్తున్నాం



విద్యుత్‌నగర్ కాలనీలో రోడ్లను అక్రమించి వాణిజ్య సముదాయాలు. కారు షెడ్‌లు నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై నోటీసులు జారీ చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తాం. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టాలని చూస్తే సహించేదిలేదు.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్